# అన్నమయ్య పదములు

*నాగులపల్లి శ్రీనివాస్*

మనసులోని మాటలై మరపురాని పాటలై
పరవశించు భావమై పరిమళించు నాదమై

తేనెలొలుకు తెలుగునై తేజరిల్లు వెలుగులై
వాక్యమాడు లాస్యమై వాద్య గోష్ఠి శబ్దమై

చెదిరిపోని శిల్పమై చెప్పరాని కల్పనై
గుండెలోని గానమై కొండవాగు గమకమై

పల్లెనుడుల మూటలై తల్లిపాడు జోలలై
పసిపాపల ఊరటై పరమాత్ముని హారతై

ధైర్యమిచ్చు తంత్రమై దయనుపెంచు మంత్రమై
హాయినిచ్చు తలపులై హానికెదురు తలుపులై

చింతదీర్చు చింతనై చెంతనిల్చు చెలిమియై
అంతులేని కలిమియై అందరందు బలిమియై

చేవనిచ్చు ప్రేరణై సేవజేయు ప్రార్థనై
నవరసాల కోటలై నడిపించెడు బాటలై

వీడిపోని మిత్రులై వాడిపోని పువ్వులై
ఎపుడునిల్చు అందమై ఎగిరిపోని గంధమై

ఆరిపోని దీపమై అంతరంగ ధూపమై
అవనినిల్చె ప్రమిదలై అన్నమయ్య పదములై

